తీజ్ పండగ చాలా ప్రత్యేకమైనది


ట్యాంక్‌బండ్‌పై జరిగిన తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న బంజరా మహిళలు

కవాడిగూడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బంజారా సంస్కృతిని చాటిచెప్పే పండుగలలో అతిముఖ్యమైనది తీజ్ పండగ అని సేవాలాల్ సేనవ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతిలాల్‌నాయక్ అన్నారు. ఈ పండగ దేశవ్యాప్తంగా బంజారాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. సేవాలాల్‌సేన ఆధ్వర్యంలో బుధవారం ట్యాంక్‌బండ్‌పై తీజ్‌ఉత్సవాలు భక్తరామదాసు విగ్రహం వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మోతిలాల్‌నాయక్ మాట్లాడుతూ ఈ పండగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు సెలవు దినంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన సంఘం ప్రధానకార్యదర్శి ధరవాత్ గణేష్ నాయక్, విద్యార్థి నాయకులు అభిషేక్ నాయక్, మహిళా నాయకురాలు శాంతిబాయ్, సంఘం నాయయకులు నాయక్, నాగు నాయక్, సరితాబాయ్ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో 'బాలుగాడి లవ్ స్టోరీ' సందడి

రాంనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాంనగర్‌లోని మదర్ థెరిసా హైస్కూల్‌లో బాలుగాడి లవ్‌స్టోరీ సినిమా యూనిట్ బుధవారం సందడి చేసింది. ఈ సినిమా ఈ నెల 8వ తేదీన విడుదల కానున్నది. మదర్ థెరిసా పాఠశాలలో హైస్కూల్ విద్యనభ్యసించిన 2014 పదో తరగతి బ్యాచ్ విద్యార్థి ఆకుల అఖిల్ ఈ సినిమాలో హీరోగా నటించారు. దీంతో ఆ పాఠశాల యాజమాన్యం హీరో ఆకుల అఖిల్, హీరోయిన్ దర్శక మినస్, నిర్మాత ఆకుల భాస్కర్ మంజుల దంపతులు, దర్శకుడు శ్రీనివాస్ తేజ, నటులు రాఘవ్ పాల్గొన్నారు.

ముస్లింలకు 10శాతం రిజర్వేషన్ల కోసమే కాంగ్రెస్ దీక్ష

బర్కత్‌పుర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు కల్పించడానికే ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తుందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి ఆరోపించారు. 42శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకే కేటాయించాలని అన్నారు. బుధవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని బీసీలంతా ఏకమై గుణపాఠం చెప్పాలన్నారు.

గో ఆధారిత ఉత్పత్తులపై విద్యార్థులకు శిక్షణ

బర్కత్‌పుర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతివిద్యార్థి భాగస్వామ్యం కావాలని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. గో ఆధారిత ఉత్పత్తులపై విద్యార్థులకు ప్రత్యేకశిక్షణ ఇవ్వనున్నట్లు ఇందుకోసం ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం గోశాల ఫెడరేషన్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పణ్ ఆధ్వర్యంలో కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గోపేడతో తయారుచేసిన పర్యావరణ రాఖీలను మొబైల్ రేడియేషన్ చిప్స్‌ను ఆయన ప్రదానం చేశారు. గోపేడ, న్యాచురల్ కలర్స్, విత్తనాలతో రాఖీలను తయారు చేసినట్లు ఆయన తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

బర్కత్‌పుర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని తూర్పు మండలం ట్రాఫిక్ ఏసీపీ అనుమల శ్రీనివాస్ హెచ్చరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఏ సమయంలోనైనా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారం బర్కత్‌పుర చౌరస్తా వద్దా కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడుపుతూ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ డ్రైవ్‌లో కాచిగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, ట్రాఫిక్ ఎస్‌ఐలు కేటి నాయక్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి'

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ జరిపేటి జైపాల్ ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నేతలు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ధర్నా సందర్భంగా వడ్డెరసంఘం నేతలు పెద్దఎత్తున పాల్గొని తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం ముఖ్యనాయకులు, వడ్డెరసంఘం తెలంగాణ గన్నుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య, చల్లంగుల కృష్ణయ్య, వడ్డెర సంఘం తెలంగాణ లక్ష్యసాధన రాష్ట్ర అధ్యక్షుడు, ట్రస్ట్ ఛైర్మన్ జరిపేటి సత్యనారాయణరాజు, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పల్లెపు వెంకట్, రూపని చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్రీఫ్ కేసులో గంజాయి తరలింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బ్రీఫ్ కేసులో గంజాయి పార్శిల్స్ పెట్టి దుస్తులు కప్పి తీసుకొచ్చి విక్రయిస్తున్న స్మగ్లర్ కటకటాలపాలయ్యాడు. నిందితుడిని అరెస్టు చేసి 14 కేజీల గంజాయిని, బీఫ్ కేసు, సెల్‌ఫోన్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం చిత్రపురికి చెందిన సునీల్ నాయక్ చదువు ఆపేసి ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. అడ్డదారిలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో స్మగ్లర్‌గా మారాడు. ఒడిశాలోని ఓ సరఫరాదారుడి ద్వారా హైదరాబాద్‌లో కొంతమంది కస్టమర్స్‌తో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నాడు. వారికి అవసరమైనప్పుడల్లా గంజాయిని కొని రెండు కేజీల చొప్పున ప్యాక్ చేసి బ్రీఫ్ కేసులో అమర్చుతాడు. వాటిపై దుస్తులు పెట్టి సిటీలో ఉద్యోగానికి వెళ్తున్నట్లు బయలుదేరుతాడు. సికింద్రాబాద్‌కు చేరుకొని గుట్టుగా కస్టమర్స్‌కు విక్రయించి డబ్బు తీసుకొని వెళ్లిపోతుంటాడు. బుధవారం కూడా కోణార్క్ రైలు నుంచి బ్రీఫ్ కేసుతో సికింద్రాబాద్‌లో దిగి వెస్ట్ మెట్రో స్టేషన్ వద్ద కస్టమర్స్ కోసం ఎదురు చూస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సౌజన్య బృందం రంగంలోకి దిగి అతడిని పట్టుకుంది. 14 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుంది. దాని విలువ మార్కెట్లో రూ. 7లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

● మరో కేసులో 400 గ్రాములు..

సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న మరో స్మగ్లర్ జుర్రు ప్రవీణ్‌ను సైతం బృందం పట్టుకున్నారు. అతని వద్ద 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి సహకరించిన జాటోత్ అనిల్‌పై కూడా కేసు నమోదు చేశారు. వారిని, సరుకును సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు.

'ఆ కుటుంబంతో మాకు ప్రాణ హాని ఉంది'

కవాడిగూడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తన ఇంటి పక్కనే నివాసం ఉండే ఓ వ్యక్తి తనను మూడు సంవత్సరాలుగా అకారణంగా వేధింపులకు గురిచేస్తూ మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్నారని కవాడిగూడ తాళ్లబస్తీలో నివాసం ఉంటున్న వెంకటేశ్వర్‌రావు(కొండల్) కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కవాడిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, తాళ్లబస్తీలో తాము 1964వ సంవత్సరం నుంచి నివాసం ఉంటున్నామని, కొద్ది రోజుల క్రితం మా ఇంటి పక్కన నివాసం ఉండే ఓ వ్యక్తి రోడ్డును కబ్జా చేయడమే కాకుండా ఫుట్‌పాత్‌ను సైతం ఆక్రమించి, దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంటి పక్కనే ఉన్న సదరు వ్యక్తితో సీనియర్ సిటిజన్లు అయిన తమకు ప్రాణహాని ఉందన్నారు. ఇంటి నిర్మాణ సమయంలో సదరు వ్యక్తి కరెంట్ వైర్లను తమ బిల్డింగ్‌కు ఆనుకునే విధంగా వేయించారని, దాంతో మాకు ప్రమాదం పొంచి ఉందన్నారు. అంతేకాకుండా వాటర్, డ్రైనేజీ లైన్లను కూడా వేశారని వాపోయారు.

ఆయన భవనం పూర్తయిన తర్వాత అందులో ఒక ఆస్పత్రి, మెడికల్‌షాపు అక్రమంగా ఏర్పాటు చేశారని, పైగా తమ ఇంటి ముందు ఎలాంటి వాహనాలు నిలపరాదని హెచ్చరికలు జారీ చేసినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ, గాంధీనగర్ పోలీసులకు ఫిబ్రవరి 25న ఫిర్యాదుచేసినా ఎవరూ స్పందించ లేదు కానీ, సదరు వ్యక్తి ఫిర్యాదుకు మాత్రం తమ ఇంటి ముందు ఉన్న మెట్లను కూల్చివేశారన్నారు. అంతటితో ఆగకుండా తమ బతుకుదెరువు కోసం ఏర్పాటు చేసుకున్న కిరాణా స్టోర్‌ను తీసేయాలని, ఎవరూ తమ ఇళ్ల ముందు అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేయవద్దని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు, గాంధీనగర్ పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.


జవహర్‌నగర్‌లో జయశంకర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న లక్ష్మీగణపతి దేవాలయం ఛైర్మన్ నర్సింగ్‌రావు తదితరులు


జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిటీసెంట్రల్ లైబ్రరీ కార్యదర్శి పద్మజ, ఉద్యోగులు, పోటీపరీక్షల అభ్యర్థులు

ప్రొ.జయశంకర్‌కు నివాళి

చిక్కడపల్లి/రాంనగర్/గోల్నాక/ముషీరాబాద్/అంబర్‌పేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తొలి దశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి, మలిదశ ఉద్యమానికి మార్గదర్శి, సిద్ధాంతకర్త ప్రొ.జయశంకర్ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం జయశంకర్ జయంతి సందర్భంగా అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు వివిధ పార్టీల నాయకులు పూలమాలలేసి నివాళ్లు అర్పించారు.


జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోపాల్


జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, పున్న సత్యనారాయణ


అంబర్‌పేట సర్కిల్ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న డీఎంసీ మారుతి దివాకర్, ఏఎంసీ రవీందర్, అధికారులు, సిబ్బంది తదితరులు


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు


ప్రొ.జయశంకర్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న బీఆర్ఎస్ భోలక్‌పూర్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్


బాగ్‌లింగంపల్లిలోని హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రొ.జయశంకర్ జయంతి కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ


బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ప్రొ. జయశంకర్, గద్దర్, కేంద్ర మాజీమంత్రి సుష్మాస్వరాజ్ చిత్రపటాలకు నివాళ్లు అర్పిస్తున్న ఛైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్, బీసీ నేత దుర్గయ్య తదితరులు

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పోటీపరీక్షల అభ్యర్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. అశోక్‌నగర్‌లో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొమరం భీమ్ స్టడీ సర్కిల్ విద్యార్థులతో బుధవారం దత్తాత్రేయ ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు ఇచ్చారు.

పేకాట ఆడుతున్న 11 మంది అరెస్ట్

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాగ్‌లింగంపల్లిలోని ఓ పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ బి. రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి బాగ్‌లింగంపల్లిలో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐ మౌనిక సిబ్బందితో దాడులు చేసి, 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. నుంచి 52 పేకాటకార్డులు, 10 ఫోన్లు, రూ.60,500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

గంగాధర్‌ను కలిసిన సినీనిర్మాతల మండలి

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమ కార్మికుల సమస్యలపై చర్చల్లో భాగంగా బుధవారం రాష్ట్ర కార్మికశాఖ అదనపు కమిషనర్ డా.గంగాధర్ సినీ నిర్మాతల మండలి సభ్యులతో సమావేశం జరిపి సమస్య పరిష్కారంపై చర్చలు జరిపారు. అయితే చర్చల వివరాలు మీడియాకు వివరించలేదు. అయితే సినీనిర్మాతల మండలి సభ్యులు గత వారం రోజుల్లో రెండుసార్లు తమతో సంప్రదింపులు జరిపారని ఈరోజు కూడా వచ్చి చర్చల్లో పాల్గొన్నారని గంగాధర్ తెలిపారు. అయితే సినీకార్మికులు 30శాతం వేతనాలు పెంచాలనే డిమాండ్‌కు నిర్మాతల మండలి సభ్యులు అంగీకరించారా లేదా అనే విషయం చెప్పలేదు. అయితే కార్మిక కమిషనర్ కార్యాలయం వారు ఒక పర్సంటేజీ ప్రతిపాదన చేసినప్పటికీ దాన్ని తాము ఒప్పుకోలేదని మంగళవారం సినీ కార్మిక యూనియన్ నేతలు తెలిపారు. ఈ నేపథ్యంలో మరోసారి నిర్మాతలను రావాలని సూచించడంతో వారు బుధవారం అదనపు కమిషనర్‌తో భేటీ అయి చర్చించారు. ఎవరికి ఇబ్బంది కలగకుండా వేతనాలు పెంచుకోవడమే తమ ఉద్దేశమని సినీకార్మిక యూనియన్ నేతలు చెబుతున్నారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

ముషీరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. బుధవారం భోలక్‌పూర్ యూపీహెచ్‌సీలో తల్లిపాలపై బాలింతలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ... అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పడితే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ యాదగిరి, రాజు, ఏఎన్ఎంలు అనూష, రేణుక, సంతోష, రజిత తదితరులు పాల్గొన్నారు. వైఎస్ఆర్ పార్కు వద్ద గల అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ యూపీహెచ్‌సీ పీహెచ్ఎన్ హేమలత, ఏఎన్ఎం చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్ శారద పాల్గొన్నారు.

సత్యేంద్ర జైన్ కేసు తీర్పు.. అసత్యంపై గెలుపు : ఆప్

కవాడిగూడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీకోర్టులో సత్యేంద్ర జైన్‌పై కేసు కొట్టివేశారని, ఇది అసత్యంపై సత్యం గెలుపు అని ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. సత్యా నీదే గెలుపు అని తెలంగాణ ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆధ్వర్యంలో నేతలు బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాయితీ ఎప్పటికీ గెలుస్తుందని బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా ఎన్ని కుతంత్రాలు పన్నినా, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలపై సీబీఐ ద్వారా అవినీతి ఆరోపణలు చేసినా సత్యం గెలుపును ఎవరూ ఆపలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మల్లంగి విజయ్‌కుమార్, మాజీ కోర్‌కమిటీ సభ్యులు మహ్మద్ మజీద్, మాజీ మహిళా అధ్యక్షురాలు హేమజిల్లోజు, మాజీ అధికార ప్రతినిధి జావెద్ షరీఫ్, ఎం.శివాజీ, కొడంగల్ శ్రీనివాస్, రాకేష్ సింగ్, వివేక్, మౌనిక, లియాఖత్ఖాన్, జీశాన్, నెహ్రూ పాల్గొన్నారు.

క్యూబాకు సంఘీభావంగా నిలబడదాం

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఆంక్షలకు వ్యతిరేకంగా క్యూబాకు సంఘీభావంగా నిలబడదామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ అమెరికా ఆంక్షలను ఖండించాలన్నారు. క్యూబాకు సంఘీభావంగా ఈనెల 13న క్యూబాకు ఆర్థికంగా మద్దతు ఇవ్వడానికి సాలిడారిటీ నిధిని సేకరించాలని పిలుపునిచ్చారు. ఎంకేఎస్ అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 13వరకు రైతుల దగ్గర నిధులు సేకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సారంపల్లి మల్లారెడ్డి, జంగారెడ్డి, ప్రసాదరావు, శోభన్, శివకుమార్ పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డును ఎప్పుడు పునరుద్ధరిస్తారు

అధికారులను ప్రశ్నించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గోల్నాక చర్చి నుంచి అంబర్‌పేట ముక్రమ్ హోటల్ వరకు నిర్మించిన ఫ్లైఓవర్‌ను ప్రారంభించి మూడు నెలలు గడిచిపోతున్నా గోల్నాక నుంచి ఛేనెంబర్ వరకు ఒక వైపు సర్వీసు రోడ్డును ఎప్పుడు పునరుద్ధరిస్తారని ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. బుధవారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఆర్అండ్‌బీ అధికారులు, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇంతవరకు సర్వీసు రోడ్డు పునరుద్ధరణ విషయాన్ని విస్మరించడంలో అంతర్యం ఏమిటని, ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రజల ఇబ్బందులు మీకు పట్టవా అని ఆగ్రహించారు. సర్వీసు రోడ్డును పునరుద్ధరిస్తేనే గోల్నాకలో ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని ఎమ్మెల్యే అధికారులకు చెప్పారు. సర్వీసు రోడ్డు లేకపోవడంతో బస్సులు, వాహనాలు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ అధికారులు ధర్మారెడ్డి, వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఈస్ట్ జోన్ ఏసీపీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం


డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. డివిజన్ న్యూపటేల్‌నగర్‌లో రూ.2.50 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను బుధవారం ఆయన స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ ప్రదీప్, బీఆర్ఎస్ నాయకులు రామారావుయాదవ్, మహేష్ ముదిరాజ్, సతీష్, వంజరి నాగరాజు, సునీత తదితరులు పాల్గొన్నారు.

'రోడ్లకు మరమ్మతులు చేయాలి'

నల్లకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాల నేపథ్యంలో బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని పలు చోట్ల రోడ్లు గుంతలమయంగా మారడంతో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే గుంతలమయమైన రోడ్లకు మరమ్మతు లు చేయాలని సూచించారు. బుధవారం డివిజన్‌లోని దుర్గాబాయిదేశ్‌ముఖ్ కాలనీ ఆక్సిజన్ పార్కు వద్ద ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపై మట్టికుప్పలతో రాకపోకలు సాగించడానికి ప్రమాదకరంగా మారిందని ప్రజలు కార్పొరేటర్‌కు ఫిర్యాదుచేశారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని జీహెచ్ఎంసీ సిబ్బందిని రప్పించి రోడ్డుకు మరమ్మతులు చేయించారు

'వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

నల్లకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో మాల యువకుడు ఎడ్ల సాయికిరణ్‌పై అకారణంగా అక్కడి కొందరు వ్యాపారులు దాడి చేయడంతో పాటు వారంరోజుల పాటు హింసించడాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ తీవ్రంగా ఖండించారు. బుధవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాల యువకుడిపై దాడి చేసిన వారిపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మాల మహానాడు అధ్యక్షుడు ఎల్.గిరిజాశంకర్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీల కోసం నిబద్ధతతో టీడీపీ కృషి'

రాంనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం నిబద్ధతతో కృషి చేసింది టీడీపీ మాత్రమేనని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏ నాడూ బీసీ ఊసెత్తలేదని ఆరోపించారు. బుధవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ అంటూ మరోసారి ప్రజలను వంచించడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, తడక వినోద్, సుక్రవేది తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలు రావచ్చు.. అప్రమత్తత అవసరం

నల్లకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, దీంతో ప్రజలు ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత సూచించారు. బుధవారం డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వర్షాలవల్ల చికెన్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, సిబ్బందితో డివిజన్‌లో పాదయాత్ర చేసి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఘనంగా పురాణం పురుషోత్తమశాస్త్రి శతజయంతి

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పురాణం పురుషోత్తమశాస్త్రి వంటి సంగీతజ్ఞులు కనిపించడం లేదని ఆయన ఎందరో సంగీత కళాకారులను దేశానికి అందించారని శాసనమండలి ప్రధానప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం ప్రఖ్యాత కర్నాటక సంగీత గురువు పురాణం పురుషోత్తమశాస్త్రి శతజయంతి వేడుకలు జరిగాయి. మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని సంగీత గురువు తరంగిణి రామరాజుకు పురుషోత్తమశాస్త్రి పురస్కారం బహూకరించి సత్కరించి మాట్లాడారు. నేడు శాస్త్రీయ సంగీతం కూడా సినిమాల ప్రభావంతో వింతపోకడలు పోతుందని ఆవేదనవ్యక్తంచేశారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళాజనార్దన మూర్తి, వంశీసంస్థల అధినేత వంశీ రామరాజు, రచయిత్రి డా.సుధ, గాయని శ్రీమణి పాల్గొన్నారు. తొలుత తరంగిణి రామరాజు త్యాగరాజస్వామి కీర్తనలను ఆలపించారు.


పోతుకూచి స్మారక సంచికను ఆవిష్కరిస్తున్న వంశీ రామరాజు, సత్యమూర్తి, పద్మావతి తదితరులు

రేపటి తరం మార్గదర్శి డా.పోతుకూచి

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రేపటితరం మార్గదర్శి డా.పోతుకూచి సాంబశివరావు అని వక్తలు పేర్కొన్నారు. అశోక్‌నగర్‌లోని అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్‌లో బుధవారం సాయంత్రం విశ్వసాహితి, అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త డా.పోతుకూచి సాంబశివరావు వర్ధంతి సభ జరిగింది. వంశీ ఆర్ట్ థియేటర్స్ అధినేత డా.వంశీరామరాజు విశ్వరచన పోతుకూచి స్మారక సంచికను ఆవిష్కరించి మాట్లాడారు. పోతుకూచి అంతర్జాతీయ స్థాయిగల తెలుగు కవి, రచయిత అన్నారు. ఆచార్య టి.గౌరీశంకర్ మాట్లాడుతూ 1960లోనే ప్రపంచ తెలుగు మహాసభలు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లో పోతుకూచి నిర్వహించారన్నారు. డా.కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ యువనవ కవుల సభలు నిర్వహించిన యువ, నవకవులను, రచయితలను ప్రోత్సహించారన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి గోళ్లమూడి పద్మావతి, సీనియర్ పాత్రికేయులు భైన దేవదాసు, కడారి సత్యమూర్తి, భాస్కరదేవ్, శివన్నారాయణ, కామేశ్వరరావు, మిద్దెసురేష్, తంగిరాల చక్రవర్తి, ఆకెళ్ళసుబ్బలక్ష్మి, కనకాచారి, జయసూర్య, పెద్దూరి వెంకటదాసు, లలితాచండి, రవి, లలిత, ఇంద్రాణి పాల్గొన్నారు.

భారతీయ ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకం


సత్యాత్మతీర్థా స్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

బర్కత్‌పుర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ సాంస్కృతి సంప్రదాయాలు, ఆధ్యాత్మికత ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని ఉత్తరాది మఠంలో సెప్టెంబర్ 7 వరకు జరగనున్న చతుర్మాస దీక్షల సందర్భంగా ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మతీర్థ శ్రీపాదుల స్వామీజిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బీజేపీనేతలు ఎక్కాల నందు, శ్యామ్‌రాజ్ ముదిరాజ్, శ్రీధర్, ఎక్కాల కన్నా, భీమ్‌రాజ్ పాల్గొన్నారు.

ఎంవీఆర్ శాస్త్రికి పరామర్శ

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలికి తగిలిన దెబ్బతో కోలుకుంటున్న ఆంధ్రభూమి మాజీ ఎడిటర్ ఎంవీఆర్ శాస్త్రిని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ బుధవారం పరామర్శించారు. చిక్కడపల్లిలోని శాస్త్రి నివాసానికి చేరుకుని ఆరోగ్యవివరాలు తెలుసుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు టి.గోపాల్, దోనేటి సత్యం తదితరులు పాల్గొన్నారు.